క్లుప్తంగా

25న మండల సమావేశం

అరకులోయ రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉషారాణి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో నగేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రభుత్వ శాఖ అధికారులు అందరు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

25న సమీక్ష సమావేశం

చింతపల్లిరూరల్: కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధులు, మండల స్థాయి ఇంజినీరింగ్ అధికారులతో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీపీ కోరాబు అనూషదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇంజినీరింగ్ అధికారులు మండలంలో జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం, జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో చేపట్టిన పనులకు వివరాలతో సమావేశానికి హాజరుకావాలని ఆమె కోరారు.

ఈవోపీఆర్డీగా అర్జునరావు



దుంబ్రిగుడ: మండల ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్డీగా అర్జునరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పాడేరు డీపీఆర్‌వో కార్యాలయంలో పనిచేస్తున్న ఆయనను పదోన్నతిపై ఇక్కడికి ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి సమర్థవంతంగా పనిచేసి మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. గిరిజనులకు సేవలు అందించడమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తామన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న ఏవో ఉమాదేవి

కొయ్యూరు: మండలంలోని కొండగోకిరి రైతు భరోసా కేంద్రంలో సిబ్బందితో మండల వ్యవసాయాధికారి ఉమాదేవి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలతో పాటు అన్నింటిని ఈ-క్రాప్‌లో నమోదు చేయాలన్నారు. పంటను ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారో వివరాలు పొందపరచాలని సూచించారు. అనంతరం ఈ-క్రాప్‌లో వస్తున్న సాంకేతిక సమస్యలపై సమర్పించారు. దీనిపై ఉన్నతాధికారులకు వివరిస్తామన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



కాశీపట్నంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

అనంతగిరి: పౌష్టికాహారంతో సంపూర్ణం ఆరోగ్యం లభిస్తోందని సీడీపీవో సంతోషికుమారి అన్నారు. మండలంలోని కాశీపట్నం పంచాయతీ కేంద్రంలోని శుక్రవారం పోషణ మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీడీపీవో సంతోషికుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలకు, గర్భిణులకు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేముడు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొయ్యూరు: యూ చీడిపాలెం పంచాయతీలో-రెండు, బకులూరు పంచాయతీలో-ఒక వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీవో లాలం సీతయ్య శుక్రవారం తెలిపారు. ఈ నెల 25లోగా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేయాలన్నారు. 26న దరఖాస్తుల పరిశీలన, 27న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఎంపికైన వారికి ఒక రోజు శిక్షణ ఇచ్చి 29న ఎంపిక ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. అక్టోబర్ నుంచి విధుల్లో చేరాల్సి ఉంటుందన్నారు.

25న ప్రత్యేక సమావేశం

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు ఈనెల 25న జల్‌జీవన్ మిషన్‌పై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో తెలిపారు. అన్ని శాఖల ఏఈలు హాజరు కావాలన్నారు.

సర్కారు వైద్యం.. పేదలకు వరం

- రోజురోజుకు పెరుగుతున్న ఓపీ కేసులు
- అందుబాటులో వైద్య సేవలు
- గిరిజనుల ఆనందం



ఆస్పత్రిలో ఓపీకి వచ్చిన రోగులు

అరకులోయటౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందని ద్రాక్షగా ఉండేది... అరకొర వైద్యం..మందుల కొరత.. అంతంతమాత్రంగానే సేవలు..అదంతా గతం.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ ఆస్పత్రులను ప్రక్షాళన చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా వైద్యానికి పెద్దపీట వేశారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్నత ప్రమాణాలతో వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం కోట్లాది రూపాయల నిధులు కేటాయిస్తున్నారు. దీంతో ప్రస్తుతం పేదలకు సర్కారు వైద్యం వరంలా మారింది. గిరిజన ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందుతోంది. అరకులోయ ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు అద్భుతంగా ఉన్నట్టు గిరిజనులు చెబుతున్నారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు రావడంతో ఆస్పత్రికి రోగుల తాకిడి రోజురోజుకు పెరుగుతోంది. డెంగీ, మలేరియా తదితర పరీక్షలు చేస్తున్నారు. ప్రభుత్వం వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లలో కూడ పరీక్ష చేసే కిట్లు అందుబాటులో ఉంచారు. దీంతో వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయిలోనే ఫీవర్ కేసులను గుర్తించే పనిలో పడ్డారు. ఏరియా ఆస్పత్రి, పీహెచ్‌సీలలో బెడ్లు నిండిపోతున్నాయి. అరకులోయ ఏరియా ఆస్పత్రిలో గడిచిన జూలై, ఆగస్టు నెలతోపాటు సెప్టెంబర్ నెల 21వ తేదీ వరకు ఓపీకి వచ్చిన రోగులకు చేసిన రక్త పరీక్షల వివరాలు పరిశీలిస్తే...ఆస్పత్రిలో 1,08,046 జనరల్ ల్యాబ్ టెస్టులు నిర్వహించగా, ఇందులో ఆరుగురికి డెంగ్యూ కేసులు నమోదైనట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ హరి చెప్పారు.

విస్తృతంగా పరీక్షలు



మలేరియా పరీక్షలు విస్తృతం చేస్తున్నాం. బాధితుల నివాసాలతో పాటు పరిసర ప్రాంతాల్లో ఫాగింగ్ చేపడుతున్నాం. ప్రతీ శుక్రవారం డ్రై డే నిర్వహించి, పరిసరాల పరిశుభ్రతపై గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, గ్రామ వలంటీర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికి రెండు విడుతల్లో దోమల మందు పిచికారీ పూర్తి చేశాం. ప్రతీ ఒక్కరూ దోమ తెరలు వాడాలి.

– ఏ.జె.సత్యనారాయణ, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్, అరకులోయ

పాఠశాలల నిర్వహణపై ప్రత్యేక దృష్టి



జి.మాడుగులలో ప్రేరణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు, తదితరులు



కొయ్యూరులో హెచ్‌ఎంలకు సూచనలు చేస్తున్న ఎంపీడీవో సీతయ్య, ఎంఈవో రాంబాబు

జి.మాడుగుల: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చంద్రశేఖరరావు, ఏటీడబ్ల్యూవో తిరుపాల్, ఎంఈవో బాబూరావుపడాల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీలు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బందికి ప్రేరణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రేరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి, పాఠశాలల్లో చేర్పించేలా చూడాలన్నారు. పాఠశాలల్లో ఆర్‌వో ప్లాంట్లు నిర్వహణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఏఎన్‌ఎంలు తనిఖీ రిజిస్టర్ నిర్వహించాలని, మధ్యాహ్న భోజనం నిర్వహణపై పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ప్రేరణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు సీడీపీవో సువర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండల కేంద్రంలో ఎంపీడీవో లాలం సీతయ్య, ఎంఈవో రాంబాబులు వివిధ పాఠశాలల హెచ్‌ఎంలతో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు వీడియో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ డ్రాపౌట్లను పాఠశాలకు తిరిగి తీసుకురావాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. సచివాలయ సంక్షేమ సహాయకులు,మహిళా పోలీసు నిరంతర తనిఖీలు చేపట్టాలన్నారు. విద్యార్థుల ముఖ హాజరు శాతం పెరగాలని సూచించారు.విద్యార్థులకు అనారోగ్యం వస్తే వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం తగదన్నారు.

కష్టపడే వారికి ప్రత్యేక గుర్తింపు

వీఆర్ పురం: పార్టీలో కష్టించి పనిచేసే వారికి గుర్తింపు తప్పక లభిస్తుందని వైఎస్సార్‌సీపీ నూతన మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు అన్నారు. మండలంలోని రేఖపల్లి లో సీనియర్ నాయకుడు మామిడి రాజు ఆధ్వర్యంలో పార్టీ నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు ఆదేశాల మేరకు 27 మంది సభ్యులతో మండల నూతన కమిటీ ఎన్నిక జరిగిందన్నారు. మండలంలోని 11 పంచాయతీల్లో ఒక్కొక్క పంచాయతీ నుంచి ఇద్దరు లేదా ముగ్గురు చొప్పున సభ్యులకు అవకాశం కల్పించామన్నారు గ్రామ స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తతంగా ప్రచారం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపైన ఉందన్నారు.సర్పంచ్ పిట్టా రామారావు , ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు , మాజీ మండల కన్వీనర్ గోపాల్, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జి బి. సత్యనారాయణ, నాయకులు గంగులు, మురళి, విజయలక్ష్మి, కాంతారావు, వెంగళరావు, బాలరాజు, నరేష్ ,జయరాజ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాజవొమ్మంగి: స్థానిక అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడాపోటీలకు ఎంపికై నట్టు హెచ్‌ఎం గోపాలకృష్ణ శుక్రవారం తెలిపారు. ఇటీవల రంపచోడవరంలో జరిగిన నియోజకవర్గ క్రీడా పోటీల్లో యోగాసనాల విభాగంలో నలుగురు, కబడ్డీలోఒకరు ఉత్తమ ప్రతిభ చాటారని, వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 29న కాకినాడలో జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయా విద్యార్థులను ఉపాధ్యాయులు లోవయ్య, పాల్‌బాబు, రేష్మ, నాగరాజు తదితరులు అభినందించారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంత జీవనం



ఆలయ పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ మత్స్యలింగం

హుకుంపేట: గడుగుపల్లిలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.6లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రామాలయం పనులను జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతు ఆధ్యాత్మికతతో ప్రశాంతమైన జీవనం కొనసాగించవచ్చని, గిరిజనులు భక్తి మార్గంలో జీవించాలన్నారు. ఎంపీటీసీ సభ్యులు సింహాచలం , స్వాభిరామ్మూర్తి, రామచందర్ పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ నిమజ్జనం



పట్టంలో లడ్డూ వేలంపాటలో సర్పంచ్ కృష్ణ తదితరులు



దేగలవీధిలోని ఊరేగింపులో భక్తులు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో గణపతి విగ్రహాల నిమజ్జనం కార్యక్రమాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి.గిరిజన గ్రామాలలోని మండపాల్లో కొలువుదీరిన గణపతి విగ్రహాలను ఊరేగించి, సమీప గెడ్డలలో నిమజ్జనం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మండలంలోని డోకులూరు,గబ్బంగి పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లో గణేష్ విగ్రహాల ఊరేగింపు సందడి నెలకొంది. దేగలవీధిలోని గిరిజన యువత డ్యాన్స్‌లు చేసి ఊరేగింపు సంబరాన్ని ఘనంగా నిర్వహించారు.

హుకుంపేట: మండల కేంద్రంలోని సతకంపట్టులో సర్పంచ్ వెంకటపూర్ణిమ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. పట్టం పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ కె.కృష్ణ, రవికుమార్, ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలంపాటలో రూ.3,551లకు ఓ భక్తుడు లడ్డూను దక్కించుకున్నాడు. పలు చోట్ల ఘనంగా గణనాథుని నిమజ్జనం జరిగింది. భక్తులు భారీగా తరలివచ్చారు.

విద్యా ప్రమాణాలు భేష్



ఎగువశోభ పాఠశాలలోని విద్యార్థులతో చదివిస్తున్న జెడ్పీటీసీ గంగరాజు

అనంతగిరి: ఎగువశోభ పంచాయతీ కేంద్రంలో గల మండల పరిషత్ పాఠశాలను జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు శుక్రవారం సందర్శించారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం విద్యాప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలించి, అభినందించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు బాగా చదుకోవాలన్నాని సూచించారు.

గ్రామాల్లో రహదారి పనులకు శ్రీకారం



రాజవొమ్మంగిలో పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్‌లు శుభలక్ష్మి, శివ గ్రామస్తులు



గొడుగుమామిడిలో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ సత్యనారాయణ



జడ్డంగిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

రాజవొమ్మంగి: మండలంలోని లబ్బర్తి నుంచి డి.మల్లవరం వరకు చేపట్టనున్న 1.5 కిలో మీటర్ల బీటీ రోడ్డు పనులను సర్పంచ్‌లు ఆగూరి శుభలక్ష్మి, చీడి శివ శుక్రవారం ప్రారంభించారు. ఈ రహదారి నిర్మాణానికి ప్రభుత్వం కోటి రూపాయల నిధులు విడుదల చేసినట్టు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. రహదారి మంజూరు కావడంతో డి.మల్లవరం గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

జి.మాడుగుల: గెమ్మెలి పంచాయతీ మహాదేవపురం-గొడుగురాయి వరకు రోడ్డు నిర్మాణ పనులను వైస్ ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచ్‌లు కె.రాంబాబు, ఎస్.రామకృష్ణ, ఎంపీటీసీ జి.సన్యాసిదొర శుక్రవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి చొరవతో గొడుగురాయి గ్రామానికి రూ.35లక్షలు నిధులు మంజూర్యయనట్టు చెప్పారు. ఎంపీటీసీ చిన్నారావు, సచివాలయ కన్వీనర్లు, సూర్యప్రకాష్‌నాయుడు, బాలయ్యపడాల్, కొండబాబు, ప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుధీర్, వార్డు నెంబర్ నారాయణమ్మ, నాయకులు గణపతి, వలసయ్య, సత్తిబాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: అమీనాబాద్‌కు రూ. 5 లక్షలు, జడ్డంగికి రూ. 17.4 లక్షలు, మారేడుబాకకు రూ. 2 లక్షలు, తంటికొండకు రూ 5లక్షలు, దూసరపాము గ్రామానికి రూ. 2 లక్షలు, లబ్బర్తికి రూ. 5లక్షలు, రాజవొమ్మంగికి రూ.5 లక్షల నిధులతో మంజూరైన సీసీ రోడ్డు పనులను జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి, సొసైటీ చైర్‌పర్సన్ శుక్రవారం ప్రారంభించారు. మండల కన్వీనర్ రామకృష్ణ, సర్పంచ్ మురళీకృష్ణ , నాయకులు తాతారావు, కాసులమ్మ, రవికుమార్, చిన్నా, విక్టరీబాబు పాల్గొన్నారు.

పీసా చట్టంపై అవగాహన అవసరం



సర్పంచులు, ఎంపిటీసీలను సత్కరిస్తున్న అధికారులు

పెదబయలు: మండల కేంద్రంలోని ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య ఆధ్వర్యంలో పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు పీసా చట్టంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీసా చట్టంపై ప్రజాప్రతినిధులు అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కారానికి, న్యాయం జరగడానికి ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. సర్పంచులు, ఎంపిటీసీలను సన్మానించారు. పీసా కమిటీలు నియమించాలని, జీవో నంబర్3కి చట్టబద్ధత కల్పించాలని, బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే ప్రయత్నం ఆపాలని, 1/70 చట్టం పటిష్టంగా అమలు చేయాలని తీర్మానం చేసి ఎంపీడీవోకు తీర్మాన పత్రాన్ని అందించారు. అడ్వకేట్ వి.మోహన్‌రావు, ఎంఈవో కృష్ణమూర్తి, జనజాగృతి సంఘం అధ్యక్షుడు సింహాచలం, ముంచంగిపుట్టు మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు వి.రమేష్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కె.బొంజుబాబు, ఎంపీటీసీ సభ్యులు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో మొబైల్ ఆధార్ కేంద్రాలు



ఎస్.పెదబయలులో ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖరరావు

జి.మాడుగుల: మండలంలోని సొలభం పంచాయతీ ఎస్.పెదబయలు గ్రామంలో ఏర్పాటుచేసిన మొబైల్ ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన మొబైల్ ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మండలంలో 17 గ్రామ సచివాలయల పరిధిలో ఈ నెల 29వ తేదీ వరకు సొలభం, పెదలోచలి, గడుతూరు, వంతాల పంచాయతీలకు చెందిన వారికి వంతాలలో ఆధార్ నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ నెల 30వరకు గెమ్మెలి, వంజరి-1, వంజరి-2, పాలమామిడి సచివాలయాలకు చెందిన వారికి నుర్మతిలో, ఈ నెల 26వరకు కె.కోడాపల్లి, జి.మాడుగుల-1, జి.మాడుగుల-2, సొలభం-2 సచివాలయాల పరిధిలోని వారికి జి.మాడుగులలో, 30వ తేదీ వరకు సింగర్భ, కోరాపల్లి, భీరం, పెదలువ్వాసింగి, నుర్మతి సచివాలయాలకు చెందిన వారికి బొయితిలి ఆధార్ కేంద్రంలో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాళ్లు భరత్‌కుమార్ నాయక్, రామకృష్ణ తదితరులు

అరకులోయటౌన్: జాతీయ సేవా పథం దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళ డిగ్రీ కళాశాలలో శుక్రవారం 'యువతపై సోషల్ మీడియా ప్రభావం మరియు పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె. భరత్ కుమార్ నాయక్, డాక్టర్ సీహెచ్.రామకృష్ణ పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ విజ్ఞాన అభివృద్ధికి ఇటువంటి పోటీ పరీక్షలు ఎంతగానో దోహదపడతాయన్నారు. పోటీల్లో విజేతలకు ఎన్ఎస్ఎస్ డే రోజున బహుమతులు అందజేయనున్నట్టు ఎన్ఎస్ఎస్ పీవోలు పి.నాగబాబు, వై. విజయలక్ష్మి, ఎం.అనితా కుమారి తెలిపారు. పోటీలకు ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి. కొండబాబు, అధ్యాపకుడు గణేష్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. వైస్ ప్రిన్స్‌పాల్స్ డాక్టర్ కె. పుష్పరాజ్, పట్టాసి చలపతిరావు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఈఈ రుక్మాంగరాజు

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలో రూ.8లక్షల నిధులతో (జిల్లా పరిషత్ నిధులు రూ.4 లక్షలు, కలెక్టర్ నిధులు రూ.2 లక్షలు, పంచాయితీ నిధులు రూ.2 లక్షలు) నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణ పనులను చింతపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రుక్మాంగరాజు శుక్రవారం పరిశీలించారు. డ్రైనేజీల నిర్మాణంలో ముఖ్యంగా నీరు నిల్వ ఉండకుండా వాటర్ లెవల్స్‌ను తప్పక పాటించాలని సూచించారు. అలా చేయకపోవడం వలన నీరు పారుదల జరగకుండా డ్రైనేజీలు నిండిపోవడానికి దారి తీస్తుందన్నారు. తద్వారా ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉంటుందన్నారు. ఏఈఈ స్వర్ణలత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఆనందరావు, ఏపీవో ప్రకాశరావు

వై.రామవరం: మండల పరిషత్ కార్యాలయంలో ఏపీవో ఎం.కె.ఎస్.ప్రకాశరావు అధ్యక్షతన ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కె.వెంకటలక్ష్మి మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి శాఖ సర్వే మేరకు వై.రామవరం మండలాన్ని అస్పిరేషన్ మండలంగా ప్రభుత్వం ప్రకటించినట్టు తెలిపారు. మండలంలో అభివృద్ధిపై ఏపీవో ప్రకాశరావుతో పాటు పలు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఏపీవో ప్రకాశరావు మాట్లాడుతూ నీతీ ఆయాగ్ శాఖ దేశంలోని 500 మండలాలను (బ్లాక్‌లను) ఏబీపీ మండలాలుగా గుర్తించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఏపీలోని 15 మండలాలను ప్రకటించినట్టు తెలిపారు. వీటిలో గిరిజన ప్రాంతంలో వై.రామవరం మండలం ఒకటి ఉందన్నారు. శిక్షణ పొందిన తామంతా కలసి ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల అభివృద్ధికి సహాయపడతామన్నారు. ఈ కార్యక్రమం విధివిధానాలు, మండలాభివృద్ధికి ప్రజల అవసరాల గుర్తింపునకు గ్రామాల్లో సర్వేపై సిబ్బందికి అవగాహన కల్పించారు. వైస్ ఎంపీపీలు వలాల విశ్వమ్మ, ముర్ల జోగిరెడ్డి, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్‌లు, ఈఓపీఆర్‌డీ మధుసూధనరాజు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు జెడ్పీటీసీకి పరామర్శ



నూకరాజును పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు

కొయ్యూరు: నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజును ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ జల్లిపల్లి సుభద్ర, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు శుక్రవారం పరామర్శించారు. జరిగిన సంఘటన దురదృష్టకరమని తెలిపారు.దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.విశ్రాంతి తీసుకోవాలని, త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు. నాయకులు మూర్తి, సింహాచలం, పాడేరు టౌన్ అధ్యక్షుడు రాంబాబు, ఎంపీటీసీ మండల ఫోరం మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గణనాథునికి పూజలు

రాజవొమ్మంగి: మండలవ్యాప్తంగా గణపతి నవరాత్రి మహోత్సవాలు శుక్రవారం ఐదవ రోజుకు చేరాయి. ఉద్యోగుల కాలనీకు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన గణనాథునికి శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. విగ్రహ దాతలు ఉమామహేశ్వర్రావు, ధనలక్ష్మి దంపతులు పర్యవేక్షించారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

పెదబయలు: గలగండ, వనభంగి పంచాయతీల్లో సిరశపల్లి, ఎగువ పేడాపల్లి, గాసాబు, గలగండ గ్రామాల్లో జెడ్పీటీసీ మత్స్యలింగం పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అ ర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఎంపిటీసీలు రామ్మూర్తి, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.